



సంగమేష్ సర్కిల్ నుంచి ర్యాలీగా వస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు

పౌర సమాజం ప్రశ్నించాలి..!

ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛను రాష్ట్రంలో పాలకులు హరిస్తున్నారని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మీడియాను నియంత్రించేందుకు పథకం ప్రకారం దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తీరును పౌర సమాజం ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. లేదంటే రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని కోల్పోతామని, అరాచకానికి దారితీస్తుందని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'చలో అనంతపురం' నిర్వహించారు. సామ్నా, ఫొటో జర్నలిస్టు యూనియన్, ఏపీజేఎఫ్, జాప్ తదితర సంఘాల నాయకులు ఈ ఆందోళనకు మద్దతుగా నిలిచారు. టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ఆయా పార్టీల అనుబంధ సంఘాలు, ఏపీఎన్జీవో, పెన్షనర్స్ అసోసియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు జర్నలిస్టుల నిరసనకు సంఘీభావం తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం



ర్యాలీలో పాల్గొన్న కర్నూలు, కడప జిల్లా జర్నలిస్టు నాయకులు





వాక్ స్వాతంత్ర్యాన్ని కోల్పోతే అరాచకమే..

- మీడియాను నియంత్రించేందుకే దాడులు
- సీఎం జగన్, డీజీపీకి స్పందించే తీరిక లేదా..?
- చలో అనంతపురంలో నిలదీసిన జర్నలిస్టు నాయకులు
- మీడియా స్వేచ్ఛను కాపాడాలని వివిధ వర్గాల డిమాండ్
- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి ఖండన

కొడితే తిరగబడతాం..!

జర్నలిస్టులను కొడితే చూస్తూ ఊరుకునేది లేదని జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. అంతవరకూ తెచ్చుకోవద్దని వైసీపీ నాయకులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌కు స్పందించే తీరిక కూడా లేదా అని నాయకులు ప్రశ్నించారు. సాక్షాత్తు సీఎం జగన్ సిద్ధం సభలోనే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేసి, చంపేందుకు ప్రయత్నించిన సంఘటనను ప్రజాస్వామిక వాదులందరూ ఖండించారని అన్నారు. అయినా ముఖ్యమంత్రిగాని, డీజీపీగాని ఇప్పటి దాకా నోరుమెదపకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే 'చలో అనంతపురం'తో ఆగమని, తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు హెచ్చరించారు.

కదం తొక్కిన జర్నలిస్టులు

అనంతపురం సంగమేశ్వర సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జర్నలిస్టు సంఘాల నాయకులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి వందలాది మంది జర్నలిస్టులు ఈ ఆందోళనకు తరలివచ్చారు. టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ఆయా పార్టీల అనుబంధ సంఘాలు, ఏపీఎన్జీవో, పెన్షనర్స్ అసోసియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకుల జర్నలిస్టుల నిరసనకు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ర్యాలీ, ధర్నాకు రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, కుల సంఘాల మద్దతు



కలెక్టరేట్ వద్ద ధర్నా అనంతరం ఎస్పీ అన్బురాజన్‌ను జర్నలిస్టు నాయకులు ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. శ్రీకృష్ణపై దాడిచేసినవారిని వెంటనే అరెస్టు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఈ కేసులో ఒకరిని ఇప్పటికే అరెస్టు చేశామని, మిగిలినవారిని త్వరలో అరెస్టు చేస్తామని అన్నారు.

దాడులను జగన్ ప్రోత్సహిస్తున్నారు



రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే మీడియా పట్ల అణిచివేత మొదలైందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. ఒక పథకం ప్రకారం దాడులను, చట్టాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. సభలు, సమావేశాలలో ముఖ్యమంత్రి నేరుగా కొన్ని పత్రికలు, చానళ్ల పేర్లను చెబుతూ.. వైసీపీ శ్రేణులను ఉసిగొలుపుతున్నారని అన్నారు. ఈ కారణంగానే జర్నలిస్టులు, మీడియా సంస్థల కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. దాడులను నియంత్రించకపోతే ప్యాలెస్ ముట్టడిస్తామని పరోక్షంగా సీఎం జగన్‌ను హెచ్చరించారు. మీడియా ప్రతినిధులు తిరగబడే దాకా తెచ్చుకోవద్దని సీఎం జగన్‌కు హితవు పలికారు. రాప్తాడు సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. తన సభలోనే ఇలాంటి ఘటన జరినా సీఎం ఇప్పటి దాకా నోరు మెదపకపోవడం దారుణమని మండిపడ్డారు. దాడులు చేసే వైసీపీ శ్రేణులను అదుపులో పెట్టకుండా, వారిని మరింత ప్రోత్సహించేలా జగన్ వ్యవహరిస్తున్నారని అన్నారు. సీఎం జగన్ తక్షణమే శ్రీకృష్ణపై జరిగి దాడికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

\- ఐవీ సుబ్బారావు,
ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు

చంపినా పట్టించుకోరా..?



వైసీపీకి ప్రజలు 151 మంది ఎమ్మెల్యేలను ఇచ్చింది జర్నలిస్టులపై దాడులు చేసేందుకేనా అని ఐజేయూ జాతీయ ప్రధాన కార్యదర్శి సోమసుందర్ ప్రశ్నించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధానాలు అమలౌతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు రాస్తే.. కేసులు పెట్టే అధికారాన్ని అన్ని శాఖల ఉన్నతాధికారులకు కల్పిస్తూ జీవో జారీ చేసిన చరిత్ర ఈ ముఖ్యమంత్రిదని విమర్శించారు. జర్నలిస్టులను హత్య చేసినా, దాడులు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ సమావేశాలు, బహిరంగ సభలకు కొన్ని మీడియా ప్రతినిధులను రావద్దనే అధికారం ఎవరికీ లేదని అన్నారు. పత్రికా స్వేచ్ఛను కాలరాసే అధికారం మీకెవరిచ్చారని సీఎం జగన్‌ను నిలదీశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని, ఈ అంశాలన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు.

\- సోమసుందర్,
ఐజేయూ జాతీయ ప్రధాన కార్యదర్శి

రౌడీషీట్ తెరవాలి



జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై రౌడీషీటు తెరవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 68 ఏళ్లుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏపీయూడబ్ల్యూజే పాటుపడుతోందని ఆయన అన్నారు. జర్నలిస్టు సంఘాలు ఎప్పుడూ స్వతంత్రంగా ఉంటాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా జర్నలిస్టుల భద్రత కోసం పోరాడుతామని అన్నారు. జర్నలిస్టులకు రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను 20 మందికిపైగా వైసీపీ వర్గీయులు విచక్షణా రహితంగా కొట్టి చంపడానికి ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

\- చందు జనార్దన్,
ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మరిన్ని వివరాలు..7లో

వాల్మీకుల గౌరవాన్ని పెంచా

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

వంద వాల్మీకి కుటుంబాలు టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వాల్మీకులు

రాయదుర్గం, ఫిబ్రవరి 22: క్రియాశీల రాజకీయాల్లో పాతికేళ్లుగా అవినీతి మరక లేకుండా బతుకుతూ, వాల్మీకుల గౌరవాన్ని ఇనుమడింపజేశానని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వంద వాల్మీకి కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు నాయకుల మలకన్న ఆధ్వర్యంలో 3, 4, 6, 31, 32 వార్డులకు చెందిన వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. స్థానిక ఆరో వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలవ మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అనంతపురం జిల్లా చరిత్రలో ప్రధాన కార్యదర్శిగా, ఆ తరువాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా అధినేత చంద్రబాబు తనకే అవకాశాలు కల్పించారన్నారు. వాల్మీకుల్లో తొలిసారి మంత్రిగా పని చేసే అవకాశం తనకే దక్కిందన్నారు. ఇన్ని పదవులు పొందినా ఎక్కడా వివాదాల్లోకి వెళ్లకుండా, అవినీతి ఆరోపణల్లేకుండా రాజకీయాలు సాగిస్తున్నానన్నారు. తన వల్ల వాల్మీకులకు గుర్తింపు, గౌరవం పెరిగాయన్నారు. 60 ఏళ్ల వాల్మీకుల ఎస్టీ హోదా సాధన కలను నిజం చేసేందుకు తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక శ్రద్ధ చూపానన్నారు. సుమారు రూ.4500 కోట్ల నిధులు మంజూరు చేయించానని, చాలా పనులు అసంపూర్తిగా ఆగిపోయాయన్నారు. వాటిని మళ్లీ తానే పూర్తి చేస్తానన్నారు. ఈసారి ఎన్నికల్లో తనను 50 వేల మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు మలకన్న, సిద్దలింగప్ప, గాదిలింగప్ప, తిప్పేశ్, వీరితో పాటు వంద కుటుంబాలు టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి పొరాళ్ల పురుషోత్తమ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు, బంగి శంకర్, కేపీ నాగరాజు, పైతోట అంజి, పైతోట సిద్దన్న, శ్రీరాములు, కొండాపురం శ్రీనివాసులు, నాగయ్య, వేణు పాల్గొన్నారు.

అది కేంద్ర ప్రభుత్వం చేసిన హత్య

ఏపీ రైతు సంఘం నాయకులు



ధర్నా చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 22: రైతు ఉద్యమంలో పాల్గొన్న శుభకరణ్‌సింగ్ హత్య ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వానిదేనని ఏపీ రైతు సంఘం నాయకులు విమర్శించారు. ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం చేస్తున్న రైతులపై పోలీసుల కాల్పులను నిరసిస్తూ ఏపీ రైతు సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు రెండో విడత ఉద్యమానికి దిగారన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరించిదన్నారు. రైతులపై పోలీసులు పైశాచికంగా దాడి చేయడంతోపాటు కాల్పులు జరపడంతో 24 ఏళ్ల శుభకరణ్ సింగ్ ప్రాణాలు కోల్పోయాడన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పండించిన పంటలకు ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. పార్లమెంట్‌లో పెట్టిన విద్యుత్ బిల్లు-2020ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రైతు మృతికి కారణమైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో చర్చలు జరిపి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, వెంకటనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, రామకృష్ణ, ఇతర నాయకులు వెంకటరాముడు, నగేష్, నరేంద్ర, దుర్గాప్రసాద్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 22: రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతుధరల గ్యారెంటీ చట్టం తేవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రైతుసంఘం ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులు పండించే అన్ని పంటలకు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫారసుల మేరకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలన్నారు. పంట రుణాలను మాఫీ చేసి, ఆత్మహత్యలనుంచి రైతాంగాన్ని కాపాడాలని కోరారు. పార్లమెంట్‌లో పెట్టిన విద్యుత్ బిల్లు 2020ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం రైతాంగం ఢిల్లీకి చేరుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు జరిపిన కాల్పుల్లో రైతు శుభకరణ్‌సింగ్ మృతిచెందాడన్నారు. రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న దుర్మార్గపు వైఖరికి ఈ ఘటన నిదర్శనమన్నారు. యువరైతు మృతికి కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీహెచ్ రాయుడు, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, మసూద్‌వలి, పవన్, దిలీప్, ఇందిరమ్మ, కుళ్లాయమ్మ, నాగలక్ష్మి, ఈరమ్మ, అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన మృత్యువు

రెండు ప్రాణాలను తీసిన చెట్టుకొమ్మ

నడింపల్లిలో విషాదకర ఘటన



విరిగిపడిన వేపచెట్టు కొమ్మ

నార్పల, ఫిబ్రవరి 22: బైకు మీద వెళుతున్న ఇద్దరిపై చెట్టుకొమ్మ విరిగిపడి ప్రాణాలను బలితీసుకుంది. ఈ విషాద ఘటన నార్పల మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎల్లుట్ల గ్రామానికి చెందిన వెంకటరాముడు (45), ఆయన భార్య నాగమణి (41) బ్యాంకు పని నిమిత్తం గూగూడుకు వెళ్లారు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా ఘోర ప్రమాదం జరిగింది. నడింపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని పురాతన వేపచెట్టు విరిగి.. బైకు మీద వెళుతున్నవారిపై పడింది. దీంతో వెంకటరాముడు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన నాగమణిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో అప్పటి వరకూ బస్సు కోసం పలువురు వేచి చూశారని, బస్సు రాగానే ఎక్కి వెళ్లిపోయారని గ్రామస్థులు తెలిపారు. ఆ తరువాత కాసేపటికే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బైకు మీద దంపతులు వెళుతున్న సమయంలో చెట్టు విరుగుతున్న శబ్దం వచ్చింది. గ్రామస్థులు కేకలు వేయడంతో వెంకటరాముడు ద్విచక్రవాహనం వేగం తగ్గించి, వెనక్కు తిరిగిచూశాడు. ఆ మరుక్షణమే వారిపై పెద్ద కొమ్మ విరిగిపడింది. తాము కేకలు వేయకపోయుంటే కాస్త ముందుకు వెళ్లేవారని, ప్రమాద తీవ్రత తగ్గేదని వాపోయారు. మృత్యువు ఇలా వారిని కబలిస్తుందని ఊహించలేదని ఆవేదన చెందారు.





వెంకటరాముడు, నాగమణి మృతదేహాలు

ఉయ్యాలవాడ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఉయ్యాలవాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఎందరికో స్ఫూర్తిని నింపే ఉయ్యాలవాడ జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రెడ్డి సంఘం నాయకులు జయపురెడ్డి, కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, హనుమంత రెడ్డి పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ రెడ్డిసంఘం నాయకులు

సంక్షేమ పథకాలను అమలు చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ



ధర్నాలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 22: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం.1214ను వెంటనే రద్దుచేసి సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కార్మికశాఖ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి మెమోలు ఇవ్వడం శోచనీయమన్నారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో 23 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 2007 నుంచి వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. ఇప్పటికైనా మెమో 1214ను రద్దు చేసి, ఇతర రాష్ట్రాల తరహాలోనే ఏపీలోనూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీనరసయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, న్యూటౌన్ కార్యదర్శి ముత్తుజా, కోశాధికారి సురేంద్ర, ఎర్రిస్వామిరెడ్డి, వీరయ్య, షేక్ జిలాన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుపై నిఘా ఉంచండి : కలెక్టరు



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22: రానున్న సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టరు గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గురువారం నిఘా కమిటీలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టరు మాట్లాడారు. కమిటీలన్నీ ఖర్చులు పర్యవేక్షించే అకౌంటింగ్ కమిటీతో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి రూ. 95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి రూ 40 లక్షలు లోపే ఖర్చు చేయాలని ఎన్నికల కమిషన్ సూచించిందన్నారు. అందుకు లోబడే అభ్యర్థులు ఖర్చు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైన సందేహాలు వస్తే నోడల్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలం.. గళం.. కదం..!



సంగమేశ్వర సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళుతున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు


కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

- దాడులపై జర్నలిస్టుల ఆగ్రహం
- తిరగబడేదాకా తెచ్చుకోవద్దని హెచ్చరిక
- చలో అనంతకు అన్నివర్గాల మద్దతు
- సీఎం జగన్ బాధ్యతారాహిత్యంపై నిలదీత

సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో అనంతపురం' నిరసన కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది. టీడీపీ, జనసేన, వామపక్షాలు, అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, కుల సంఘాలు, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలు, ఇతర జర్నలిస్టు సంఘాలు.. ఇలా ఒకరేమిటి.. అందరూ కలం శ్రామికులతో గళం కలిపి కదం తొక్కారు. ఫొటో జర్నలిస్టుకు మద్దతుగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. నగరంలో నిర్వహించిన ర్యాలీ, కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొని.. ప్రజాస్వామ్య నాలుగో స్తంభానికి ఏర్పడుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల కార్యాలయాలపై దాడులను ముక్త కంఠంతో ఖండించారు. చూస్తూ ఊరుకునేది లేదని, తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. స్వయంగా పత్రికను నిర్వహిస్తున్న జగన్.. జర్నలిస్టుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని తప్పుబట్టారు. పద్ధతి మార్చుకోవాలని, వైసీపీ మూకలను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఆందోళనకు మద్దతుగా కర్నూలు, కడప ఉమ్మడి జిల్లాల సహా.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది జర్నలిస్టులు తరలివచ్చారు.

పాలేగాళ్ల రాజ్యాన్ని తలపిస్తోంది



రాష్ట్రవ్యాప్తంగా మీడియా ప్రతినిధులపై దాడులు చేస్తూ వైసీపీ నాయకులు పాలేగాళ్ల రాజ్యాన్ని తలపిస్తున్నారు. సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను వైసీపీ మూకలు తరుముకుంటూ వెళ్లి విచక్షణారహితంగా దాడిచేసి హత్య చేసేందుకు ప్రయత్నించడం అమానవీయం. ఇలాంటి దుర్మార్గపు దాడులను ఏ పార్టీ చేయలేదు. దాడిచేసిన వారిలో దాదాపు 20మంది పేర్లు బయటకువచ్చినా వారిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు వెనుకంజవేస్తున్నారు. ఇప్పటికైనా దాడిచేసిన వైసీపీ మూకలపై హత్యాయత్నం కేసు నమోదుచేసి జైలుకు పంపాలి. లేనిపక్షంలో ఎస్పీ, డీజీపీ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తాం. మీడియా ప్రతినిధులకు అన్నిరకాలుగా అండగా ఉంటాం.

- గోనుగుంట్ల సూర్యనారాయణ, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత

జగన్ నాయకత్వంలోనే దాడి



రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి జగన్ నాయకత్వంలో జరిగిందనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఆ సభలో ఆయన ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే ఈ దుర్మార్గమైన చర్యకు పాల్పడ్డారు. దాడి వీడియో చూస్తుంటే ప్రతిఒక్కరూ బాధపడ్డారు. ఐదేళ్లలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయి. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. గత ప్రభుత్వాల్లో ఎప్పుడు జర్నలిస్టులపై దాడులు జరగలేదు. రాబోయే రోజుల్లో పవన్‌కళ్యాణ్ అనంతకు రాబోతున్నారు. ఈ విషయంపై ఆయన గట్టిగానే స్పందిస్తారు. జర్నలిస్టు మిత్రులు ఏ నిర్ణయం తీసుకున్నా.. ఏం చేసినా జనసేన పార్టీ అండగా ఉంటుంది.

- టీసీ వరుణ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు


ర్యాలీగా కలెక్టరేట్‌కు వస్తున్న జర్నలిస్టులు


బైఠాయించి నిరసన తెలుపుతూ...

అనంతపురంఅర్బన్/విద్య/ప్రెస్‌క్లబ్/సెంట్రల్/కల్చరల్,ఫిబ్రవరి 22: చలో అనంతపురానికి ఏపీయూడబ్ల్యూజే పిలుపు ఇవ్వడంతో జర్నలిస్టులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కర్నూలు, కడప తదితర ప్రాంతాల నుంచి నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేకచట్టం తేవాలని డిమాండ్ చేశారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. నిరసనలో

తరలివచ్చిన జర్నలిస్టులు

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రసూల్, ఎలక్ట్రానిక్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దానియల్, ఐజేయూ సభ్యులు ప్రభాకర్‌నాయుడు, కొండప్ప, కే. నాగరాజు, నాయకులు చౌడప్ప, చలపతి, కేపీకుమార్, తిప్పేస్వామి, రమేష్, మల్లికార్జున, కంబగిరి, భూమిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, సుంకన్న, అంజి, సీపీఐ రాష్ట్ర నాయకులు జగదీష్, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, సరిపూటి రమణ, మారుతీకుమార్ గౌడ్, ముక్తియార్, అజీజ్, జేఎం బాషా, వన్నూరు, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు జయరామిరెడ్డి, అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ముప్పూరి కృష్ణ, జనసేన పార్టీ ప్రచార కమిటీ కార్యదర్శి చలపతి, నాయకులు సదానందం, ఇమామ్ హుస్సేన్, మేదర వెంకటేష్, మురళీ, సంతప్, అశోక్, హరి, విజయ్, లాల్‌స్వామి, అనిల్, రమణ, సోము, మహేష్, మల్లి, బెస్త సేవా సంఘం నాయకులు చేపల హరి, చంద్రబాబు, నాగరాజు, శీనా, మారుతి, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హఠావో.. జర్నలిస్టు బచావో..



సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో ఇసుక అక్రమాలపై వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు నమోదుచేశారు. జర్నలిస్టులు బచావో.. జగన్ హఠావో.. నినాదంతో ఐక్యంగా పోరాడాలి. లేనిపక్షంలో జర్నలిస్టుల ఉనికిని కాపాడుకోలేని పరిస్థితులు వస్తాయి. జర్నలిస్టులు సమస్యలపై ఎప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంటారు.

- శ్రీనాథ్‌రెడ్డి, ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడప

డీజీపీ, జగన్ బాధ్యత తీసుకోవాలి



శ్రీకృష్ణపై దాడులు చేసిన అందరిపై పోలీసులు క్రిమినల్ కేసులు కట్టాలి. జగన్ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే వైసీపీ నాయకులను రెచ్చగొట్టి దాడు లు చేయిస్తున్నారు. డీజీపీ వైసీపీ అల్లరి మూకలు చేసే అరాచకాలకు వ త్తాసు పలుకుతున్నారు. మరో మూడు నెలల్లో సీఎం జగన్ జైలుకు.. డీజీపీ ఇంటికి వెళ్లడం ఖాయం. రాష్ట్రంలో ఫ్యాక్షనిస్టు తరహా పాలనను వైసీపీ చేస్తుండటం సిగ్గుచేటు. మీడియాపై దాడులు విరమించుకోవాలి.

- శ్రీరాములు, సీపీఐ నగర కార్యదర్శి

దాడి హేయం



శ్రీకృష్ణపై వైసీపీమూకలు దాడి చేయడం దారుణం. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తే దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారింది.

- వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ, అనంతపురం రూరల్ మండలం

దాడులు చేసేందుకు సిద్ధం



జర్నలిస్టులపై దాడులు చేసేందుకే సిద్ధం సభలు చేపట్టినట్టు అనిపిస్తోంది. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి జర్నలిస్టులను చాలా గౌరవించేవారు. అలాంటి నాయకుడి కుమారుడై ఉండి జర్నలిస్టులపై దాడులు చేయిస్తావా..? శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేయాలి.

- రామసుబ్బారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే కడప జిల్లా అధ్యక్షుడు

ఫ్యాక్షనిస్టు సీఎం అయితే ఇలాగే ఉంటుంది..



ఫ్యాక్షనిస్టు సీఎం అయితే పాలన ఇలాగే ఉంటుంది. మీడియాపై దాడులను ఏపీ రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అవహాస్యమవుతోంది. ఈ ఐదేళ్ల కాలంలో మీడియాగొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బహిరంగ సభలో ఏకంగా సీఎం జగన్ మీడియా సంస్థల పేర్లు చెప్పి దాడులు చేయాలన్నట్టుగా హెచ్చరికలు జారీ చేస్తే ఆ పార్టీ కేడర్ దాడులకు తెగబడదా..? ఈ దాడులను ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలి.

- మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మీడియా లేకుంటే మనుగడే లేదు..



మీడియా లేకుంటే రాజకీయ నాయకుల మనుగడే లేదు. కార్యక్రమాలను కవర్ చేసే వారిపై దాడులు చేయడం దుర్మార్గం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ సీఎంలు అయ్యారంటే మీడియా చేసిన ప్రచారం కాదా..? ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉన్న జర్నలిస్టులపై దాడులు మానుకోవాలి. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తాం.

- దేవళ్ల మురళి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

ప్రత్యేక చట్టం తేవాలి



జర్నలిస్టుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి అమలు చేయాలి. జగన్మోహన్‌రెడ్డికి కోడికత్తి శీను చిన్నపాటి గాటు వేసినందుకే ఐదు సంవత్సరాల పాటు శీనుకు బెయిల్ రాకుండా జైలులో ఉంచారు. వేలాదిమంది సమక్షంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన నిందితులపై అదేతరహాలో బెయిల్ లేకుండా కఠినంగా జైలుశిక్ష విధించాలి.

- నాగేంద్రకుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారు..



మీడియా స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోంది. ఐదేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న దురాగతాలకు సమయం దగ్గర పడిందనేందుకు ఇదే నిదర్శనం. మా సమస్యలపై పోరాడేటప్పుడు మీడియా మిత్రులు ఏ విధంగా స్పందించారో... మీ సమస్యలకు మా గొంతు తోడై అండగా ఉంటాం. ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడ సాధించే వరకూ పెన్షనర్ల సంఘం తరుపున తోడుగా ఉంటాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఇంతపెద్దఎత్తున వచ్చి సంఘీభావం తెలపడం శుభపరిణామం.

-జయరామప్ప, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎమర్జెన్సీని తలపిస్తోంది



ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీని తలపిస్తోంది. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికృతచేష్టలు చేస్తున్నాయి. జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం దారుణమైన చర్య. విలేకరులపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినట్లే. శ్రీకృష్ణపై దాడి అందరినీ కలచివేస్తోంది. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే వైసీపీ అల్లరిమూకలు రెచ్చిపోయి దాడులకు దిగాయి. అక్షరం, కలంపై దాడి సమావేశం నిర్వహిస్తున్నాం. విజయవంతం చేయండి.

- పోతుల రాధాకృష్ణ, ఫర్ ది సొసైటీ వ్యవస్థాపకుడు

నిజాలు రాస్తే దాడులా..?



నిజాలు రాస్తే దాడులు చేస్తారా..? ఈ ప్రభుత్వ హయాంలో అవినీతి, రౌడీయిజం పెరిగింది. శ్రీకృష్ణపై విక్షణారహితంగా దాడులు చేయడం దుర్మార్గం. కర్నూలు ఈనాడు కార్యాలయంపైనా రాళ్లదాడికి తెగబడటం అన్యాయం. రాప్తాడులో ఎమ్మెల్యే దౌర్జన్యాలు, బెదిరింపులు కూడా అనేకం చూశాం. ఈ విషయాలను బయటపెడతారన్న దురుద్దేశంతోనే దాడులు చేస్తున్నారు. ఇది చాలా అరాచకం. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు వీటిని ఖండించాలి.

- సంతోష్ కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి, ఏఐవైఎఫ్

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు



వైసీపీ ప్రభుత్వం వచ్చాక జర్నలిస్టుల మీద దాడులు పెరిగాయి. సమాజంకోసం తమ ప్రాణాలు సైతం లెక్కచేయక జర్నలిస్టులు పాటుపడుతున్నారు. ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ కూడా విధి నిర్వహణలో భాగంగానే సభకు వెళ్లాడు. ఆ సమయంలో ఒక్కడిని చేసి పైశాచికంగా మూకుమ్మడి దాడికి వైసీపీ మూకలు పాల్పడడం దుర్మార్గం. జర్నలిస్టుల ఉద్యమానికి పూర్తి మద్దతుగా నిలుస్తాం.

- నల్లప్ప, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

చర్యలు తీసుకోవాలి



శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ఈ దాడిని విద్యార్థుల రాజకీయ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. సమాజ హితంలో భాగంగా నిరంతరం సమాచారాన్ని సేకరించి ప్రజలకు అందించే పాత్రికేయులపై ఇలాంటి దాడులు చేయడం సబబుకాదు. మొన్న ఆంధ్రజ్యోతిపై, నిన్న ఈనాడుపై దాడులు చేయడం చాలా బాధాకరం.

- రామన్న, విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

దాడులు సిగ్గుచేటు



జర్నలిస్టులపై వైసీపీ మూకలు దాడులు చేయడం సిగ్గుచేటు. సాక్షాత్తు సీఎం సిద్ధం సభలోనే శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడి చేసి చంపాలని చూడటం దారుణం. ఈ ఘటనపై సీఎం జగన్ నోరువిప్పాలి. సిద్ధం సభలో జరిగిన దాడికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. టీడీపీ తరఫున జర్నలిస్టులు చేసే ఉద్యమాలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం.

- గౌస్‌మొహిద్దీన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

ఓటమి భయంతోనే...



ఓటమి భయం పట్టుకొని సీఎం జగన్‌రెడ్డి జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్నారు. రాప్తాడు సిద్ధం సభలో జనంరాక తేలిపోవడంతో ఆ గుట్టు ఎక్కడ బయటపడుతుందోనని విలేకరులు, ఫొటోగ్రాఫర్లపై తన అల్లరి మూకలు, రౌడీలతో దాడి చేయించారు. సభ ముగిస్తున్న సమయంలో చొక్కాలు మడతపెట్టి సిద్ధం... సిద్ధం అంటూ దాడులు చేయమని సీఎం జగన్‌రెడ్డే ఆ పార్టీ రౌడీలను ఉసిగొల్పారు. ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా పోలీసు యంత్రాంగం ఒక్కరిని అరెస్టు చేయడం చూస్తుంటే వీరి వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. వెంటనే ఎస్పీ ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి దాడికి పాల్పడిన ప్రతిఒక్కరినీ కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి.

- పెండ్యాల శ్రీలత, జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్

అండగా ఉంటాం...



ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు తరలిరావడం శుభపరిణామం. ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతోందో ప్రపంచానికి తెలియపరిచే జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు తెగబడటం మంచిపద్ధతి కాదు. వారి కొచ్చే చాలీచాలని జీతాలతో కుటుంబసభ్యులను సైతం పక్కన పెట్టి విధులు నిర్వహిస్తుంటారు. మంచి, చెడులను ఎప్పటికప్పుడు సమాజానికి చూపించి దిశానిర్దేశం చేసే శక్తి మీడియాకు ఉంది. అలాంటి వారి మీద రాజకీయ నాయకులు ఆ పత్రిక మనకు పనిచేయదు... ఈ పత్రిక మనకు పనిచేయదని దాడులకు పాల్పడటం జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులు అండగా ఉంటారు.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్

బెదిరింపులకు పాల్పడుతున్నారు



శ్రీకృష్ణ సౌమ్యుడు, మంచివాడు. తనపని తాను చేసుకొని వెళ్లేవాడు. అలాంటి వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా కొడుతుంటే అందరి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతిపక్షాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఇళ్ల వద్దకెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని చరిత్రలో ఎన్నడూ చూడలేదు. నన్ను ఎవరు ఏమీ చేయలేరనుకుంటే పొరబడినట్లే. ప్రభుత్వమే ఇలా వ్యవహరిస్తే సమాజంలో ప్రజలు ఏ విధంగా బతకాలి. మీడియా మిత్రులు దేశంలో ఏ మూలన ఏం జరిగినా మంచి, చెడులను ప్రజల ముందువుంచుతారు. అలాంటి మీడియా మిత్రులపై దాడి చేయడం దారుణం. ఈ పరిస్థితుల్లో అందరూ ఏకమై త్వరలోనే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి.

- పెద్దనగౌడ్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

దాడి ప్రీప్లాన్డ్‌గా జరిగింది



శ్రీకృష్ణపై దాడి ప్రీప్లాన్డ్‌గా జరిగింది. దీని వెనకాల పెద్ద కుట్ర దాగి ఉంది. దాడి జరిగిన సందర్భంలో పోలీసులు పట్టించుకోకపోవడం బాధాకరం. దాడి జరిగి ఐదు రోజులు గడుస్తున్నా ఒకరిని అరెస్టు చేసి మిగతా వారిని పట్టించుకోకపోవడం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఇకపై జర్నలిస్టులపై దాడులు జరిగితే చూస్తూ ఊరుకునేదిలేదు.

- రమణయ్య, సీపీఐ నాయకులు

వెంటనే అరెస్టు చేయాలి..



శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేయాలి. దాడి చేసిన వారి ఫొటోలు, పేర్లు పత్రికల్లో అడ్రస్సులతో సహా వైరల్ అవుతున్నా పోలీసులు కేవలం ఒకరిని మాత్రమే రిమాండ్‌కు పంపడం బాధాకరం. పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలి. దాడి చేసిన ప్రతి ఒక్కరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలి.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారు..



సీఎం జగన్ ప్రత్యక్షంగా దాడులకు దిగుతున్నారు. ప్రతిపక్ష పార్టీలపై ఏ విధంగా విమర్శలు చేస్తున్నాడో అదేవిధంగా ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఇతర పత్రికలు, టీవీ ఛానళ్లపై విమర్శలేకాకుండా దాడులు చేస్తున్నారు. శ్రీకృష్ణ సభ కవరేజ్‌కు వెళ్లాడు. అయితే వైసీపీ మూకలు పాత్రికేయుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ దాడిచేశారు. గీత, ఖురాన్, బైబిల్ సాక్షిగా పాలన చేయడం అంటే ఇదేనా జగన్. పత్రికలను, ప్రతిపక్షాలను విమర్శించడం కాదు. జగన్‌కు ఇంటి నుంచే వ్యతిరేకత వస్తోంది. అది గుర్తించాలి. పాత్రికేయులు వృత్తి ధర్మాన్ని పాటిస్తున్నారు. వారిపై దాడులు చేయడం సరికాదు. ఆనాటి కమ్యూనిస్టు విశ్వేశ్వరరెడ్డి తన అనుచరుడైన ఎర్రిస్వామిని కాపాడాలని ప్రయత్నాలు చేయడం, దారుణం. ఆయనకు సిగ్గనిపించాలి. జర్నలిస్టుల రక్షణకు ఎల్లవ్వుడూ ముందే ఉంటాం.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి


సాకేహరి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

ఎందుకు అరెస్టు చేయరు..?

శ్రీకృష్ణపై దాడిచేసిన వారిలో ఒకరిని మాత్రమే అరెస్టు చేసి మిగతావారిని ఎందుకు చేయడంలేదు. వారేమన్న వేరే దేశానికి పారిపోయారా..? దాడి సరైనదేనని నిందితులు వాట్సాప్ మెసేజ్‌లు పెడుతుంటే పోలీసులు ఎందుకు అరెస్టు చేయడంలేదు. వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలి.

తిరుగుబాటు తప్పదు...

రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. రానున్న రోజుల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు. వాస్తవాలను ప్రజల ముందుంచుతున్న జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం దారుణం. శ్రీకృష్ణపై దాడిచేసినవారు ప్రభుత్వానికి, పోలీస్‌శాఖకు ఎందుకు కనిపించడంలేదు. వెంటనే అరెస్ట్‌చేసి జైలుకు పంపాలి.

-వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు


ఓబులూరు పరమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కఠిన చర్యలు తీసుకోవాలి

శ్రీకృష్ణపై వైసీపీమూకలు విచక్షణ కోల్పోయి చేసిన దాడి దారుణమైనది. అందరిపట్ల నిష్పక్షపాతంగా పాలన సాగిస్తామని ప్రమాణం చేసిన జగన్మోహన్‌రెడ్డి ఆ ప్రమాణాన్ని విస్మరించాడు. సీఎం కుర్చీని కాపాడుకోవడంకోసం దేనికైనా సిద్ధం అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు అమలు చేస్తే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.


రమణారెడ్డి, సామ్నా రాష్ట్ర కార్యదర్శి

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిది. జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు పనిచేస్తుంటారు. వారిపై దాడులు చేయడం మానుకోవాలి. శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. అలాచేస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల నాయకులు

వైసీపీ దాడులు సిగ్గుచేటు

ఆత్మకూరు ఫిబ్రవరి 22: వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి, కర్నూలు ఈనాడు కార్యాలయంపై వైసీపీ అల్లరి మూకలు దాడులు సిగ్గుచేటని టీడీపీ మండల నాయకులు మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ... పత్రికలపై దాడులు అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. దాడులు చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, పార్లమెంటు అధికార ప్రతినిధి, మాజీ కన్వీనర్లు వేణుగోపాల్, మనోరంజన్, వెంకటనారాయణ, నూరి, నాయకులు కందుల ఓబులపతి, కార్తీక్ నందన్, ఆనంద్ పాల్గొన్నారు.

హంసాయపల్లిలో లీకేజీ.. తాగునీటి సరఫరాకు ఆటంకం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 22: అనంతపురం నగర ప్రజలకు మరోసారి తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఎదురుకానున్నాయి. కూడేరు మండలం హంసాయపల్లి వద్ద గురువారం రాత్రి పైపులైన్ లీకేజీ అయింది. ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి అక్కడికి వెళ్లి మరమ్మతులు చేపట్టేలా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. శుక్రవారం ఉదయం నీరు సరఫరా అయ్యే ప్రాంతాలకు సాయంత్రం, సాయంత్రం సమయంలో సరఫరా అయ్యే కాలనీలకు శనివారం ఉదయం తాగునీరు సరఫరా అవుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆదరణ సొసైటీ బాధితుల ఆందోళన



డీసీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22: తమ కష్టార్జితం సొమ్మును షేర్ హోల్డర్లుగా ఆదరణ సొసైటీలో డిపాజిట్ చేశామని, అయితే ఆ సొసైటీ మూసివేయడంతో తమ సొమ్మును తిరిగి ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. ఆదరణ బాధితుల న్యాయ సహాయ సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ... ఆదరణ మాక్ సొసైటీలో 20 ఏళ్లుగా డిపాజిట్ రూపంలో డబ్బులు కట్టి షేర్‌హోల్డర్లుగా చేరామని, సుమారు 431 మందికి సంబంధించి రూ.100 కోట్ల వరకు డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏటా ఆడిట్ చేయకుండా సహకార శాఖ అధికారులు ముడుపులు పుచ్చుకుని సొసైటీ అక్రమాలకు సహకరించడం దారుణమని మండిపడ్డారు. వెంటనే తమ సొమ్మును తిరిగి వెనక్కు ఇప్పించాలన్నారు. ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలకు సైతం విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. దీనికి డీసీఓ ప్రభాకర్‌రెడ్డి స్పందిస్తూ... ఆదరణ మాక్ సొసైటీలో డిపాజిటర్లకు సొమ్ము రావాల్సిన మాట వాస్తవమేనని, విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదరణ బాధితుల న్యాయ సహాయ సమితి సభ్యులు ఆదినారాయణ, సురేంద్ర, శాస్త్రి, గోవిందరెడ్డి, రామకృష్ణయ్య, జయశంకర్, నంజప్ప, రామచంద్రరావు, మహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారికి గరుడసేవ





గరుడసేవపై స్వామివారు, వెండి కవచంతో భక్తులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 22: కొండమీదరాయుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. ఉదయం స్థానిక కొండమీదరాయుడు స్వామి దేవాలయంలో ఉత్సవమూర్తులకు బుక్కరాయసముద్రం గరుడాద్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు సూర్యనారాయణరావు, శివకుమార్, చంద్రకాంత్‌రావు, సుబ్రహ్మణ్యం, వైద్యం శ్రీనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీనారాయణస్వామి దేవాలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ స్వామి వారికి గరుడ సేవ నిర్వహించారు. స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గజవాహనం సేవ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బంగారు, వెండి ఆభరణాల సంతర్పణ

స్వామికి కుందుర్పి మండలం ఎనుముల దొడ్డి గ్రామానికి చెందిన నాగేష్ ఐదు తులాలు బంగారు చైను, కర్పూరం ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీనివాసుమూర్తి రెండు కేజీల కవచాన్ని అందజేశారని ఈఓ సాకే రమేష్‌బాబు తెలిపారు. 22ఆర్‌పీటీ2: విరాళం అందిస్తున్న నంబూరి రమణ

విగ్రహ ఏర్పాటుకు విరాళం



రాప్తాడు, ఫిబ్రవరి 22: అనంతపురం నగరంలోని కమ్మభవన్‌లో వినాయక స్వామి విగ్రహ ఏర్పాటుకు రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెంది న నంబూరి రమణ రూ. 25 వేలు విరాళం అందచే శారు. చెక్కును కమ్మభవన్ అధ్యక్షుడు సరిపూటి సూర్యనారాయణకు గురువారం అందచేశారు.

విరాళం అందిస్తున్న నంబూరి రమణ

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య : జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టులో సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న రెండు ఫిజియోథెరపిస్టు పోస్టుల తాత్కాలిక పద్ధతిలో భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాద్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపిస్టు అభ్యర్థులు https://possaatp.blogspot.com వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, వాటిని ఈనెల 27లోగా టీవీ టవర్ సమీపంలోని సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వైసీపీ ప్రచార సభలా... ఆసరా సభ





వేదికపై వైసీపీ నేత వీరాంజనేయులు, ఇతరులు, మీటింగ్‌కు వచ్చినట్లు డ్వాక్రా మహిళలతో సంతకాలు చేయించుకుంటున్న వెలుగు సిబ్బంది

- వేదికపై వైసీపీ నేతలు
- మీటింగ్‌కు రాకపోతే ఆసరా డబ్బు కట్ అంటూ బెదిరింపులు
- హాజరైనట్లు సంతకాల సేకరణ

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 22: ప్రభుత్వ సొమ్ముతో బుక్కరాయసముద్రంలో గురువారం నిర్వహించిన ఆసరా సభ.. వైసీపీ ప్రచార సభ మార్చేశారు. ప్రభుత్వం నిర్వహించే సభా వేదికపైన అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రొటోకాల్ ప్రకారం ఆశీనులు కావాలి. ఈ సభావేదికపైన ఎలాం టి అర్హత లేకున్నా... నూతనంగా నియమిం చిన సమన్వయకర్త వీరాంజి నేయులు, వైసీపీ నేతలు బయ్యపరెడ్డి, బుల్లేరాజా, చొప్పా నారాయణ స్వామి కూర్చొన్నారు. అంతేకాకుండా వైసీపీకి ఓటేయ్యాలని వైదికపై నుంచే సూచించారు. వీరాంజి నేయులు ప్రచార సభలో లాగా వేదికపై నిలబడి అందిరికి అభివాదం చేశారు. ఇంతజరుగుతున్నా... అధికారులు ఏ మాత్రం అతన్ని అడ్డుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

మీటింగ్‌కు రావాల్సిందే..

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఖచ్చితంగా రావాల్సిందే... లేదంటే ప్రభుత్వం ఇచ్చే ఆసరా డబ్బులు కట్ చేస్తామని మండలంలోని డ్వాక్రా మహిళలను వెలుగు సిబ్బంది బెదరింపులు దిగింది. అంతేకాకుండా.. ఏకంగా మీటింగ్ వద్ద యానిమేటర్లకు ఒక పేపరు ఇచ్చి ... సంఘంలోని సభ్యులు ఎంత మంది వచ్చారని హాజరైనట్లు సంతకాలు కూడా చేయించుకున్నారు. సంతకాలు చేయని వారికి రుణాలు, ఆసరా డబ్బులు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. దీనికి తోడు సమావేశం ప్రారంభం నుంచి ముగింపు వరకు ఏ ఒక్కరూ సభ నుంచి వెళ్లిపోకుండా కట్టడి చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు కార్యక్రమానికి మధ్యాహ్నం 12 గంటలు నుంచే సభ వద్ద కుర్చీపెట్టారు. కనీసం వచ్చిన డ్వాక్రా మహిళలకు భోజనం, కనీసం తాగడానికి నీరు కూడా ఇవ్వలేదు. కనీసం కూర్చొడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో కిందనే కుర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎమ్మెల్యే అనంతవి పొంతనలేని మాటలు: జనసేన





సమస్యలపై ఆరా తీస్తున్న పెండ్యాల శ్రీలత, టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 22 : ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చెప్పే మాటలకు... వాస్తవ పరిస్థితులకు ఏ మాత్రం పొంతన లేదని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అన్నారు. గురువారం 21వ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్‌లో మహిళలతో నిర్వహించిన మాటామంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంత వెంకటరామిరెడ్డి కాలనీలో అరకొర రహదారులు వేసి... డివిజన్ మొత్తం అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నాడని ఎద్దేవ చేశారు. కానీ డివిజన్‌లో వాస్తవ పరిస్థితులు చూస్తే అభివృద్ధి శూన్యమన్నారు. రోడ్లు సరిగ్గాలేక మురుగు కాలువలు పూడిక తీయక దుర్భర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తాగునీరు సకాలంలో రాకపోవడంతో డివిజన్‌లోని ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారన్నారు. సమస్య లన్నీ పరిష్కారం కావాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీలకు ఓటు వేసి వైసీపీని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

పలు కాలనీల్లో 'జనసేన జయభేరి'

అనంతపురంరూరల్ : మండలంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని అజయ్ ఘోష్ కాలనీ, మదర్ తెరిసా కాలనీలో జనసేన జయభేరి కార్యక్రమాన్ని జనసేన జిల్లా అధ్యక్షుడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ టీసీ వరుణ్ గురు వారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగు తూ.. టీడీపీ, జనసేన ప్రవేశ పెట్టనున్న పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగితెలుసుకున్నారు. జనసేన, టీడీపీలను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, పంచాయతీ తెలుగు దేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ వరుణ్‌చౌదరి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర, కార్యదర్శులు కిరణ్‌కుమార్, సిద్దు, జయమ్మ, విజయకుమార్, కృష్ణ, నగర ఉపాధ్యక్షులు సదానందం, నగర ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, హుసేన్, కార్యదర్శులు మురళి, అంజి, సంపత్, వీరమహిళలు సరిత, అంజలి, వర్షిత, అరుణ, రమాదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో న్యాక్ బృందం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 22: నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం గురువారం జేఎన్‌టీయూలో పర్యటించింది. ఈ కమిటీ చైర్మన్‌గా పీపీ సావని యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డీన్ ప్రొఫెసర్ పరాగ్ సంఘని, కో- ఆర్డినేటర్‌గా మౌలానా అజాద్ ఎన్ఐటీ ప్రొఫెసర్ సతీష్‌పాల్ సింఘ్ రాజ్‌పుత్, సభ్యులుగా పెరియార్ మణియమ్మై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ జయంతి బాలసుందరం, సామ్ హిగ్గిన్‌బాటమ్ అగ్రికల్చర్ టెక్నాలజీ అండ్ సైన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విర్జినియా పాల్, న్యూ హారిజాన్ ఇంజనీరింగ్ కళాశాల డాక్టర్ మంజునాథ ఉన్నారు. వీరు మూడు రోజుల పాటు వర్సిటీని పరిశీలిస్తారు. ఉదయం జేఎన్‌టీయూకి చేరుకున్న ఈ బృందానికి వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శశిధర్ ఆహ్వానం పలికారు. అనంతరం మధ్యాహ్నం వరకు డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి పీపీటీ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశం తరువాత మూడు బృందాలుగా విడిపోయిన కమిటీ సభ్యులు.. లైబ్రేరి, హెల్త్‌సెంటర్, సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలను, ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌ను పరిశీలించారు. సాయంత్ర ఫ్యాకల్టీతో సమావేశం నిర్వహించారు. అనంతరం వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కల్చరల్ ప్రోగ్రామ్స్‌ను వీక్షించారు. శుక్రవారం మరోసారి విభాగాలను పర్యటించి రికార్డులను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, విభాగాధిపతులు కేఎఫ్ భారతీ, కళ్యాణిరాధ, మమత, అజిత, దిలీప్‌కుమార్, మారాల రామశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న విద్యార్థులు

మౌనగిరి క్షేత్రంలో పూజలు

రాప్తాడు, ఫిబ్రవరి 22: మండలంలోని హంపాపురం సమీపంలోని మౌనగిరి హనుమన్ క్షేత్రంలో మౌనగిరి వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో లోక కళ్యాణం కోసం గురువారం మృత్యుంజయ, నవగ్రహ, సహస్ర కమలములతో మహాలక్ష్మి యాగం నిర్వహించారు. శనివారం మాఘమాసం పౌర్ణమి రోజున పూర్ణాహుతి కార్యక్రమంతో ఈ పూజలు ముగుస్తాయన్నారు.

కారుణ్య నియామకం

అనంతపురం క్రైం: నగరపాలికలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చారు. ఇంజనీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి దస్తగిరి అనారోగ్యంతో మరణించాడు. గురువారం అతని భార్య రమీజాకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చారు. ఇంజనీరింగ్ విభాగం ఈఈ సూర్యనారాయణ, నగర మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు.

సమాచార హక్కును వినియోగించుకోవాలి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవని 22: పారదర్శకమైన పాలన సాగాలంటే ప్రభుత్వ శాఖల్లో నిర్వహించే పనులపై సమాచార హక్కును వినియోగించుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు వన్నూరప్ప పేర్కొన్నారు. గురువారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ రసూల్ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... సమాచారం కోరిన 30 రోజుల్లో సమాచారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందన్నారు. లేకపోతే శిక్షకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రాణహానికి సంబంధించిన బాధితుడు గాని అతని పక్కాన కుటుంబ సభ్యులు, బంధువులకు గాని 48 గంటల్లో సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం సమాచార హక్కుచట్టం పుస్తకాలను పంపిణీచేశారు కార్యక్రమంలో మధుసూదన్, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు

రాప్తాడు, ఫిబ్రవరి 22: అర్హులైన వారందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలని జడ్పీ సీఈఓ నదియాదేవి తెలిపారు. రాప్తాడులోని గ్రామ సచివాలయాన్ని గురవారం పరిశీలించిన ఆమె మాట్లాడారు. ఆరోగ్య శ్రీ కార్డులు లేకుండా ఉండి దరఖాస్తున్న వారిలో అర్హులందరికీ పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతావాణి, అధికారులు పాల్గొన్నారు.

'కేఎస్ఎన్' డిగ్రీ పరీక్షల్లో 78 శాతం ఉత్తీర్ణత

అనంతపురం సెంట్రల్: కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా కళాశాల డిగ్రీ పరీక్షల్లో 78 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారని ఎస్కేయూ వీసీ హుస్సేన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య ఆధ్వర్యంలో ఫలితాలను విడుదల చేసిన వీసీ మాట్లాడారు. ఈ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) సాధించిన తరువాత సొంతంగా పరీక్షలు నిర్వహించడం హర్షనీయమన్నారు. నూతన విద్యా విధానంలో ప్రవేశాలు పొందిన డిగ్రీ ప్రథమ సెమిస్టర్ బీఏ, బీకామ్, బీఎస్సీ హానర్ పరీక్షల్లో 483 మందికిగాను 380 మంది విద్యార్థులు పాస్ కావడం అభినం దనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పాల్ లక్ష్మిరంగయ్య, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామి నర్ శివశంకర్, ఐక్యూఏసీ పర్వీన్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హార్లే డేవిడ్‌సన్



ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ముఖ్యఅతిథులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22: ప్రముఖ ద్విచక్రవాహన కంపెనీ అయిన హీరో మోటోకార్ప్, హార్లే డేవిడ్‌సన్ సంయుక్త ఆధ్వర్యంలో హార్లే డేవిడ్‌సన్ ఎక్స్ 440 ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. గురువారం రాత్రి నగర శివారులోని వివాహా భోజనంబు గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ద్విచక్రవాహనాన్ని నరసింహా హీరో అధినేత సునీల్‌రెడ్డి, హీరో మోటోకార్ప్ ఏఎస్ఎం దీవక్, టీఎస్ఓ హనుమ ఆవిష్కరించి, కస్టమర్లకు అందించారు. మొదటిరోజు 18 వాహనాలను డెలివరీ చేసినట్లు వారు తెలిపారు. దీని ఎక్స్ షోరూం ధర రూ.2,39,500 అన్నారు. హార్లే డేవిడ్‌సన్ కంపెనీ బైక్ డ్రైవ్ చేయటం ప్రతిఒక్కరి కల అన్నారు. అటువంటి బైక్‌ను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నరసింహా హీరో షోరూం జీఎం రాకేశ్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాసుల శెట్టి (ఫైల్)

నార్పల/బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 22: నార్పల మండలం బొమ్మలా టపల్లి మిట్ట వద్ద గురువారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో నార్పల వాసి శ్రీనివాసుల శెట్టి (55) మరణించాడు. అతను, అతని భార్య ఉమామ హేశ్వరి బైక్‌పై గురువారం అనంతపురం వెళ్లారు. అనంతరం నార్పలకు వస్తుండగా బొమ్మలాటపల్లి మిట్ట వద్ద నార్పల నుంచి అనంతపురం వెళ్తున్న ఆటో అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో శ్రీనివాసుల శెట్టి, ఉమా మహేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా అనంతపు రం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసుల శెట్టి మరణించాడు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 22: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కళ్యాణదుర్గం రోడ్డు ఎస్‌బీఐ కాలనీకి చెందిన తులసి (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తులసి కుమారుడు సాయి సంకేత్ ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం కేసులో ఐదేళ్ల జైలు

ఓ దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా రూ.లక్ష బాధితురాలికి పరిహారం చెల్లించాలని అనంతపురం నాలుగో ఏడీజే కోర్టు తీర్పు ఇచ్చింది. కూడేరు మండలం గొట్కూరు గ్రామానికి చెందిన హనుమంతు (55) ఓ దివ్యాంగురాలిపై 2019 డిసెంబరు 29న అత్యాచారం చేశాడు. అప్పటి ఎస్ఐ యువరాజు కేసు నమోదు చేశారు. సీఐ కృష్ణారెడ్డి సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కోర్టుకు నివేదిక సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం నాలుగో ఏడీజే కోర్టు న్యాయాధికారి శోభారాణి తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారి కృష్ణారెడ్డి, యువరాజును, ఏపీపీ సుజన, కోర్టు ఏఎస్ఐ ఓబుళపతిని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

చైన్‌స్నాచింగ్

నగరంలోని మిత్ర హోటల్ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్ ఆవరణంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. ఆ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఆదెమ్మ గురువారం మధ్యాహ్నం పార్కింగ్ ప్లేస్‌లో నిద్రిస్తోంది. ఓ దొంగ ఆ సమయంలో మహిళ మెడలోని ఐదు తులాల బంగారు గొలుసు దొంగలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించారు. అందులో ముసుగు వేసుకున్న దొంగ గొలుసు దొంగలించి అపార్ట్‌మెంట్ మెట్లు ఎక్కుతూ కనిపించాడు. ఆ దొంగ అపార్ట్‌మెంట్‌లో వాడా..? బయటి వ్యక్తా..? అనేది తేలాల్సి ఉంది.

ప్రత్యేక అవసరాల పిల్లలకు సామగ్రి అందజేత

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 22: స్థానిక చింతవనం కార్యాలయంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు సామగ్రిని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. నెల్లూరుకు చెందిన కాంపోసైట్ రీజనల్ సెంటర్ ఈ సామగ్రిని సమకూర్చినట్లు ప్రతిభా సొసైటీ నిర్వాహకులు తెలిపారు. నెల్లూరు ప్రాంతీయ కేంద్రం (ఎన్ఐఈపీఐడీ)కు చెందిన స్పెషల్ ఎడికేటర్ మల్లికార్జున నాయక్ 53 మంది పిల్లలకు ఈ సామగ్రిని, దృష్టి లోపం ఉన్న మరో 17 మందికి స్మార్ట్ కేన్స్ పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ మేనేజర్లు రమేశ్ కుమార్, శ్రీకాంత్, కార్తీక్, మహేశ్, జబీరా, ప్రతిభా సొసైటీ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.



ఎస్ఐ ఎన్వీ రమణకు అంతిమ వీడ్కోలు

పాల్గొన్న మంత్రి బుగ్గన, అనంత, నంద్యాల ఎస్పీలు

గార్లదిన్నె,ఫిబ్రవరి 22 : తెలంగాణ రాష్ట్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నంద్యాల జిల్లా ఎస్ఐ, అనంతపురం వాసి నంబూరి వెంకట రమణ అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు మధ్య గురువారం ముగిశాయి. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రరెడ్డి, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డి ఎస్ఐ ఎన్వీ రమణ మృతదేహానికి నివాళులర్పించారు. రమణ భార్య శ్రీవాణి, కుమార్తె అనూషను పరామర్శించారు. 1989లో ఈయన జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందాక నందికొట్కూరు పోలీస్‌స్టేషన్‌లో, రాచర్ల ఎస్‌హెచ్‌ఓగా పనిచేశారు. బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణ, అల్లుడు పవన్‌సాయి, డ్రైవర్ చంద్రశేఖర్ చనిపోయిన విషయం తెల్సిందే. ఎస్ఐ మృతదేహాన్ని స్థానిక రామచంద్రనగర్‌లో ఉన్న ఆయన స్వగృహానికి గురువారం తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాన్ని గార్లదిన్నె మండలం మర్తాడు సమీపంలోని సొంత తోటకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. పీటీసీ అదనపు ఎస్పీ మల్లికా గ్గురవర్మ, అనంతపురం డీఎస్పీ వీర రాఘవరెడ్డి, రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, పలువురు సీఐలు, ఎస్ఐలు, బ్యాచిమేట్లు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, బంధువులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి, ఎస్పీలు, అధికారులు

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టండి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22: టెన్త్, ఇంటర్, టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అధికారులకు విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశించారు. గురువారం ఈ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్యాశాఖ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ సమీక్షలో కలెక్టరు గౌతమి, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, ఇంటర్ అధికారి వెంకటరమణనాయక్, డీఈఓ వరలక్ష్మీ పాల్గొన్నారు. విద్యాశాఖ కమిషనర్ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణకు సంబంధించి పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్, మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ఉంటాయన్నారు. ఈపరీక్షలకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల కేంద్రాల్లో ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో పిల్లల కు బస్సు సౌకర్యాలు ఉండేలా చూడా లన్నారు. ఎండా కాలం కాబట్టి ఫస్ట్ ఎయిడ్ అందించ డానికి వైద్యసిబ్బందిని ఉంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని కోరారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ : డీఆర్‌ఓ

గ్రూప్-2 సర్వీసెస్ పోటీ పరీక్షలు ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు జిల్లాలో 111 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎటువంటి సమాచారం కోసమైనా 08554-220009కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు,



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు, విద్యాధికారులు



బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 176964

WANTED

WANTED Sales Promoters & Office boy to one of the Leading, Laptop store. RISHABH COMPUTERS, Raju Road, Anantapuramu. Ph:901490 7222

AJA 6251

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి Goverment colleges లో B.Sc (Nursing) B.Sc (MLT), BPT(ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (ఫుల్ ఫీస్ రీయింబర్స్‌మెంట్) ... 9030661651

AJA- 176963

కావలెను

అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు జూనియర్ అకౌంటెంట్ కావలెను ఆకర్షణీయమైన జీతం సంప్ర: JK Enterprises, Opp Montessori School, Gooty Road, ATP, Cell:8008803109.

AJA-175029

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

జర్నలిస్టులపై దాడులు దుర్మార్గం



నిరసన తెలుపుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 22: జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులు దుర్మార్గమైనచర్య అని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ ఖండించారు. స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో గురువారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అత్యంత హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి చిన్నా, నాయకులు దేవేంద్ర, సత్తార్, రామాంజనేయులు, జిలాన్, బాషా, జానయ్య ప్రతాప్, కృష్ణ, రామాంజి, రామదాసు పాల్గొన్నారు.

దుండగులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పుట్లూరు, ఫిబ్రవరి 22: రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన దుండగులను వెంటనే అరెస్ట్‌చేయాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకుడు నూరి మాట్లాడుతూ బహిరంగసభను కవర్ చేయడానికి వెళ్లిన శ్రీకృష్ణపై దాడి చేయడం దారుణమన్నారు. పోలీసులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంకటచౌదరి, పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 22: కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కళ్యాణదుర్గం కళాశాలలో 30 సంవత్సరాల క్రితం విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్ రఘురామమూర్తిని సన్మానించారు. ప్రిన్సిపాల్ 30 సంవత్సరాల క్రితం కళ్యాణదుర్గంలో విధు లు నిర్వహిస్తున్న అనుబంధాన్ని పూర్వ విద్యార్థులు గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ మా ట్లాడుతూ మానవ సంబంధాలు తగ్గిపోతు న్న తరుణంలో ఇలాంటి గురుశిష్య సం బంధం వుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శాంతి, నాగమణి, శ్రీరాములు, వన్నూరుస్వామి, గంగాధర్, రవిబాబు, ఇషాక్, ఫణీంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో తల్లి మృతి

● అనాథలైన అంధ కుమారులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 22: మండలంలోని గోనేహాళ్ గ్రామంలో వడ్డే రంగమ్మ (47) అనే మహిళ గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వడ్డే రంగమ్మ రెండురోజుల క్రితం జ్వరం వచ్చిందని బళ్లారి ఆస్పత్రికి వెళ్లగా అక్కడ చికిత్స అందిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో గురువారం మృతి చెందిందన్నారు. ఈమెకు ఇద్దరు కుమారులు వన్నూరుస్వామి, రంగ న్న ఉన్నారు. వారు పుట్టుకతోనే అంధులు. కుటుంబానికి పెద్దదిక్కుగా వున్న తల్లి మృతి చెందడంతో కుమారులిద్దరూ అనాథలుగా మిగిలారని గ్రామస్థులు తెలిపారు. వీరికి తండ్రి భీమరెడ్డి మాత్రమే ఆధారమని అన్నారు.



వడ్డే రంగమ్మ (ఫైల్)

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాడికి, ఫిబ్రవరి 22: మండలంలోని ఎన్. తిమ్మాపురం గ్రామం వద్ద రైలు పట్టాల సమీపంలో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభించింది. రైలు పట్టాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడాన్ని సమీప పొలాల రైతులు గమనించారు. పోలీసులకు, రైల్వే జీఆర్పీ సిబ్బందికి సమాచారం అందించారు. జీఆర్పీ సిబ్బంది కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. రైలులో ప్రయాణించే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతిచెంది ఉంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

యల్లనూరు, ఫిబ్రవరి 22: మండలంలోని లక్షుంపల్లి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి విద్యుత్‌షాక్‌కు గురై ఉదయగిరి బాషా(36) మృతిచెందాడని ఏఎస్ఐ సంపత్ తెలిపారు. నాయనపల్లి గ్రామానికి చెందిన బాషా చేపలు పట్టడానికి చిత్రావతి నదిలోకి రాత్రి 10గంటల సమయంలో వెళ్లాడు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య వన్నూరమ్మతోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి...

కణేకల్లు, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని రాంనగర్‌లో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాయదుర్గం మండలం వీరాపురం గ్రామానికి చెందిన తిప్పేస్వామి (38) అనే వ్యక్తి ఉడేగోళం గ్రామంలో తన సోదరి ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. సంఘటనపై ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

గుత్తిరూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన నరేష్(22) అనే యువకుడి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన చిన్న లక్ష్మన్న కుమారుడు నరేష్ గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగినట్లు బంధువులకు తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రెండు దుకాణాల దగ్ధం

గుత్తి, ఫిబ్రవరి 22: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గుర్తుతెలియని ఆకతాయిలు చెత్తకు నిప్పుపెట్టడంతో రెండు దుకాణాలు దగ్ధమై రూ.లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. తాడిపత్రి రోడ్డులోని చెత్త పక్కన వెంకటేష్ అనే వ్యక్తి బార్బర్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని పక్కనే సురేష్ అనే వ్యక్తి గుజరీ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో బార్బర్, గుజరి షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.లక్షలు నష్టపోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

డ్రిప్ పరికరాలు..

బెళుగుప్ప, ఫిబ్రవరి 22: మండలంలోని ఆవులెన్నలో గురువారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు తిప్పేస్వామికి చెందిన డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. ఏడు ఎకరాల్లో పంట సాగుకు అమర్చిన పరికరాలు కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. గుర్తుతెలియని వ్యక్తులు డ్రిప్ పరికరాలకు నిప్పుపెట్టినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు తిప్పేస్వామి వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కుందుర్పి, ఫిబ్రవరి 22: అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. గురువారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మండల పరిధిలోని ఎనుములదొడ్డి, బోదపల్లి గ్రామాల మధ్య శెట్టూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన నాగభూషణ కర్ణాటక మద్యం తరలిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకుని 240 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సైకో జగన్‌ను ఇంటికి సాగనంపుదాం

● ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, ఫిబ్రవరి 22: సైకో సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. మండలంలోని రామసాగరంలో గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మహిళలు హారతులిచ్చి కుంకుమ తిలకం దిద్ది స్వాగతించారు. కార్యకర్తలు, నాయకులు బాణసంచా కాల్చుతూ గజమాల వేశారు. మునుపెన్నడూలేని ఉత్సాహంగా స్థానికులు తరలివచ్చారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై అవగాహన కల్పిస్తూ టీడీపీని గెలిపించాలని కోరారు. స్థానిక టీడీపీ నాయకులతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

గుంతకల్లుటౌన్: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీచౌక్, అజంతా సర్కిల్, ప్రధాన కూడలిలో గురువారం టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జితేంద్రగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆర్ శ్రీనాథ్ గౌడ్ ప్రతి దుకాణానికి వెళ్లి టీడీపీ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అవినీతి, అరాచకం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందన్నారు. జగన్ పాలనలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతాడని తెలిసి పత్రికా విలేకరులపై దాడులు చేయడం నీచమైన చర్య అన్నారు. కడపలో హౌజ్ హౌస్ 98 శాతం పైగా పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేయక నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్ర ప్రజలు బాగుండాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడ్, యువనాయకులు అనిల్‌గౌడ్, ధర్మతేజ్ గౌడ్ పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జితేంద్రగౌడ్

సైకోతో శూన్యం... సైకిల్‌తోనే అభివృద్ధి

యాడికి: సైకో పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, సైకిల్ పాలన వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కోటవీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో సమస్యలపై ప్రజలను ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ సైకో పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు, భౌతిక దాడులు పేట్రేగిపోయాయన్నారు. వీటన్నింటికీ చరమగీతం పాడాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల భవిత బాగుపడాలంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, టీడీపీ నాయకులు తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ, లక్ష్మణ్, నారాయణస్వామి, బొట్టు శేఖర్, నరసింహచౌదరి, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, సుభాన్, రామచంద్ర, రంగస్వామి, ప్రవీణ్, విశ్వనాథ్, బయపరెడ్డి, త్రినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు హారతులిస్తూ స్వాగతం పలుకుతున్న మహిళలు



సమస్యలపై ఆరాతీస్తున్న జేసీ అస్మిత్‌రెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

ఉరవకొండ, ఫిబ్రవరి 22: మండలంలోని రాయంపల్లి గ్రామానికి చెందిన 60 మంది వైసీపీ దళితకుటుంబాలు టీడీపీలోకి చేరాయి. కౌకుంట్ల గ్రామంలో పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నాగరాజు, అంజనేయులు, ఎల్లప్ప, బసవరాజులకు పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులను దగా చేసిందన్నారు. దళితుల సంక్షేమ పథకాలు అన్నింటినీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, వెంకటేశులు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన ఎంపీటీసీ, వైసీపీ నాయకులు




టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులతో పయ్యావుల శ్రీనివాసులు

షేక్షానుపల్లి ఎంపీటీసీ టీడీపీలోకి చేరిక

వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలంలోని షేక్షానుపల్లికి చెందిన వైసీపీ ఎంపీటీసీ రామలింగ టీడీపీలోకి చేరారు. మండలంలోని కౌకుంట్లలో టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీటీసీకి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు రామకృష్ణప్ప, హనుమంతు, అయ్యపరెడ్డి, రాజశేఖర్, మనోహర్, లక్ష్మన్న, శ్రీనివాసులు, సిద్ధప్ప టీడీపీలోకి చేరారు.

ఘనంగా ధ్వజారోహణం

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ, అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. శుక్రవారం శ్రీవారి కల్యాణోత్సవం, ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, శనివారం స్వామివారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్‌టీ తిప్పేస్వామి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి జీఎస్ నరసింహులు, ఉపాధ్యక్షులు ధర్మన్న, సత్యనారాయణ, రాఘవేంద్రప్రసాద్, కమలాక్షుడు పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆదిమల్లయ్య స్వామిని దర్శించుకున్న కాలవ



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని ఆయతపల్లి గ్రామంలో వెలసిన ఆదిమల్లయ్య స్వామిని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించడంతో టీడీపీ నాయకుల పిలుపుమేరకు కాలవ శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ హనుమంతు, మాజీ ఎంపీటీసీ పురుషోత్తమ్, టీడీపీ నాయకులు జనార్ధన్ రెడ్డి, యర్రిస్వామి రెడ్డి, బేకరీ రాజు, పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రంగనాథుడు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి గురువారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు వివిధ పుష్పలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. గ్రామవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం చిన్న రథంపై కొలువుదీర్చి భక్తులు జమ్మిచెట్టు వరకు లాగారు. ఆలయ ఈఓ దేవదాసు అర్చకులు చేతన్ వర్మ, రవి స్వామి, లికిల్ వర్మ, ఉదయ్, నవీన్ పాల్గొన్నారు.



అలంకరణలో స్వామి అమ్మవార్లు

27న కసాపురం ఆలయ హుండీ లెక్కింపు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 22: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో 27వ తేదీన హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వై భద్రాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు హుండీల్లో వేసిన కానుకలను ఆలయ ఆవరణలో లెక్కిస్తామన్నారు. ఆలయ సిబ్బంది, సమితి సభ్యులు హాజరుకావాలన్నారు.

సునామ జకినీమాత ఉత్సవాలు ప్రారంభం


గుత్తి, ఫిబ్రవరి 22: పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ రోడ్డులో వెలసిన ఆరెకటికల అరాధ్యదైవమైన సునామ జకినీ, మల్యామ జకినీమాత ఉత్సవాలను గురువారం సాయంత్రం వైభవంగా ప్రారంభించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయం వద్ద నుంచి కన్యలు, ముత్తయిదువులు పూర్ణకలశాలతో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని ప్రత్యేక రథంలో కొలువుదీర్చి ఊరేగించారు. స్థానిక ఆలయంలో అమ్మవారికి పూర్ణకలశాలతో అభిషేకం నిర్వహించారు. ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్కారి లక్ష్మణ్‌రావు, రాజేష్‌ఖన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీరావు, సుధీర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేష్‌రావు, కార్యదర్శి సాయినాథ్‌రావు, నాయకులు భాస్కర్‌రావు, భాగ్యరాజు, సాయినాథ్, రామచంద్రరావు, విష్ణువర్ధన్ రావు, దుర్గారావు, అమర్నాథ్ పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన ఆరెకటికలు

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 22: మండలంలోని కసాపురం గ్రామం లో నూతనంగా నిర్మించిన లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవాలయం లో గురువారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం త్రిదండిరామానుజన్ జీయర్‌స్వామి చేతుల మీదుగా మేళతాళాల మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అ నంతరం స్వామి వారికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి పరశురాముడు, శకుంతల, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న త్రిదండిరామానుజన్ జీయర్‌స్వామి

మార్కెట్‌లోకి హ్యార్లీ డెవిడ్సన్



ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ముఖ్యఅతిథులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 22: ప్రముఖ ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటోకార్ప్, హార్లీ డెవిడ్సన్ సంయుక్త ఆధ్వర్యంలో హార్లీ డెవిడ్సన్ ఎక్స్ 440 ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగర శివారులోని వివాహ భోజనంబు గార్డెన్‌లో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ద్విచక్ర వాహనాన్ని నరసింహ హీరో అధినేత సునీల్ రెడ్డి, హీరో మోటో కార్ప్ ఏఎస్ఎం దీపక్, టీఎస్ఓ హనుమా ఆవిష్కరించి కస్టమర్లకు అందించారు. మొదటి రోజు 18 వాహనాలను డెలివరీ చేసినట్లు వారు తెలిపారు. దీని ఎక్స్ షోరూం ధర రూ.2,39,500 అన్నారు. హార్లీ డెవిడ్సన్ కంపెనీ బైక్ డ్రైవ్ చేయటం ప్రతి ఒక్కరి కల అన్నారు. అటువంటి బైక్‌ను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ హీరో షోరూం జీఎం రాకేష్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

కుందుర్పి, ఫిబ్రవరి 22: మండలంలో ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎస్‌కే లెనిన్‌బాబు తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాపకులు లీలా లక్ష్మారెడ్డి అన్నారు. సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ద్వారా లెనిన్ బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ సహకారం వుంటుందని అందుకు గాను రూ.1.50 లక్షలు చెక్కును లీలా లక్ష్మారెడ్డి లెనిన్‌బాబుకు అందజేశారు. లెనిన్‌బాబు మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం మొదలుపెట్టిన విద్యార్థి ఆలోచించు కార్యక్రమం నుంచి నేడు స్థాపించిన సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు వరకు ఎన్నో సలహాలు, సూచనలు అందిస్తూ ముందుకు నడిపించడమే కాకుండా ఆర్థికంగా కూడా వెన్నుదన్నుగా నిలిచిన లీలా లక్ష్మారెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 22: గ్రామ వలంటీర్లు వైసీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని టీడీపీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జరుగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు నర్సస్ వలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, మహమ్మద్ రఫీ, ఆనంద్, మొండి చెన్నప్ప, ముక్కన్న, పీఎల్ రామాంజనేయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంచేందుకే విజ్ఞాన ప్రదర్శనలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 22: విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని డాక్టర్ కార్తీక్ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీనివాస విద్యానికేతన్ హైస్కూలులో గురువారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. సోలార్, బిందు సేద్యం, ఉపగ్రహాలు, రాకెట్ తదితర అంశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కరెస్పాండెంట్ శ్రీనివాసులు, ఎస్ఐ శివ, ప్రిన్సిపాల్ సుమ, సిబ్బంది ప్రతాప్, నరేష్, గిరిజ, సురేష్, తిప్పేస్వామి, ఆవులెన్న సర్పంచ్ రాము పాల్గొన్నారు.

సీనియర్లకే టిక్కెట్ కేటాయించాలి

● సమన్వయ సమావేశంలో ఉమా, ఉన్నం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 22: టీడీపీలో 40 సంవత్సరాలుగా పనిచేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికే టీడీపీ టిక్కెట్ కేటాయించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి స్పష్టం చేశారు. గురువారం పార్టీ క్యాంప్ కార్యాలయంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకంగా పోరాటం చేశామన్నారు. ప్రభుత్వాన్ని ఎండగడుతూ ఎన్నో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 40 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చేశామన్నారు. అహర్నిశలు శ్రమించి పార్టీని ముందుకు తీసుకెళ్లిన వారికే టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరి సమన్వయంతో కూడిన సంతకాల సేకరణ చేపట్టి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి ఫ్యాక్స్ ద్వారా పంపించారు.



సమావేశంలో పాల్గొన్న ఉమామహేశ్వరనాయుడు, ఉన్నం హనుమంతరాయచౌదరి

ఓటరు జాబితాలో తప్పులకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



సమస్యను ఈఆర్వో దృష్టికి తీసుకెళ్తున్న టీడీపీ నాయకుడు

ఉరవకొండ, ఫిబ్రవరి 22: ఓటరు జాబితాలో తప్పులకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. ఇంటింటా ఓటర్ల జాబితాపై బీఎల్వోలు పరిశీలన చేసినా తప్పులు ఉన్నాయని ఈఆర్వో శిరీష దృష్టికి తీసుకెళ్లారు. ఓట్ల తొలగింపుపై ఇచ్చిన ఫిర్యాదు జాబితా ఇవ్వాలని అడిగినా పట్టించుకోలేదని సీపీఎం నాయకులు మధుసూదన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్లు శ్రీనివాసులు, దస్తగిరి, మహమ్మద్ రఫీ, హరినాథ్, రత్నా రాధిక రాజకీయ పార్టీ నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, గోవింద్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి రాతట్టుపై శ్రీమతి టీ.డీ W/o మహబూబ్ బాషా D.No.6-1-208, లక్ష్మీనగర్,అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నయెడల 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్ కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రిం.డి॥ అనంతపురం రూరల్ సబ్ రిం.డికి చేరిన రాప్తాడు మండల కేంద్రంలోని సర్వేనెం.275/2 లో 14 సెంట్ల భూమి వివరం.

చెక్కుబందీ:-తూర్పు : ఇదే సర్వేనెంబరు లో మిగిలిన ఎగ్రికల్చరల్ భూమి. పడమర:రోడ్డు,ఉత్తరం:శీలక నారాయణ మరియు ఇతరులకు చెందిన ప్రాపర్టీ, దక్షిణం: సిద్ధప్ప కాలువ.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

పుస్తకాల వితరణ


బెళుగుప్ప, ఫిబ్రవరి 22: మండలంలోని నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలకు గురువారం ఎస్ఆర్ఐ వాసవీ సంఘం ఆధ్వర్యంలో దాతలు భాగ్యమ్మ, మహేష్ గ్రంథాలయ పుస్తకాలు వితరణ చేశారు. రూ.24,600 విలువ చేసే పుస్తకాలను అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. దాతకు ఎంఈవో మల్లారెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈవో దాతను అభినందించారు.



CEEDED SITAARE FILMS
94404 19231, 99085 49498
వాసవి థియేటర్, గుంతకల్.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(కిట్టెర్స్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA-176964

WANTED

WANTED Sales Promoters & Office boy to one of the Leading, Laptop store. RISHABH COMPUTERS, Raju Road, Anantapuramu. Ph:901490 7222

AJA-6251

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి Government colleges లో B.Sc (Nursing) B.Sc (MLT), BPT(ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు) నందు అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు కాలేజీలోనే హాస్టల్ వసతి కలదు.సంప్ర: 9030661651

AJA-176963

కావలెను

అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు జూనియర్ అకౌంటెంట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: JK.Enterprises, Opp Montessori School, Gooty Road, ATP, Cell:8008803109.

AJA-175029

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి